నమస్తే తెలంగాణ
జోగుళాంబ గద్వాల వనపర్తి
10 | మహబూబ్‌నగర్, మంగళవారం 15 ఏప్రిల్ 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

# రజతోత్సవ సభకు తరలాలి


- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- వనపర్తిలో బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం



వనపర్తిలో బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 14 : వరంగల్‌లో ఈనెల 27న చారిత్రాత్మకంగా నిర్వహించే రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో వనపర్తి పట్టణ, మండల పార్టీ ముఖ్య నాయకులతో రజతోత్సవ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. అంతకుముందు డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్ జిల్లా కేంద్రంలో జరుగనున్న రజతోత్సవ సభకు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. గ్రామాలు, పట్టణాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలతో ఒక ప్రభంజనంలా.. పండుగలా తరలిరావాలని కోరారు. వరంగల్‌కు తరలివచ్చే వారి కోసం అన్ని ఏర్పాట్లు చేశామని సన్నాహక సమావేశంలో అనూహ్య స్పందన లభించిందని, ఈ ఉత్సాహం స్థానిక సంస్థల ఎన్నికల వరకు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పలుస రమేశ్‌గౌడ్, పరం జ్యోతి, ఆవుల రమేశ్, మాణిక్యం, కురుమూర్తియాదవ్, విజయ్‌కుమార్, అశోక్, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగన్న, బండారు కృష్ణ, కంచె రవి, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, గులాంఖాదర్, హుస్సేన్ ,ఇమ్రాన్, సయ్యద్, గౌస్, గిరి, రఘునాథ్‌రెడ్డి, భానుప్రకాశ్‌రావు, మహేశ్వర్‌రెడ్డి, శ్యాం, గోపాల్ తదితరులు ఉన్నారు.

# డేంజర్ బెల్స్



- కోయిల్‌సాగర్‌లో అడుగంటిన జలం
- 13.2 అడుగులకు చేరిన నీటి నిల్వలు
- పంటలకు నీళ్లివ్వలేమని చేతులెత్తిన సర్కారు
- తాగునీటి అవసరాలకే అంటున్న అధికారులు
- వందలాది ఎకరాల్లో పంటల పరిస్థితి ప్రశ్నార్థకం

### పంటలు ఎండితే సర్కారుదే బాధ్యత : మాజీ ఎమ్మెల్యే ఆల



ఈసారి వర్షాలు బాగానే పడ్డాయి. నీటిని నిల్వ చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. కృష్ణా నది నుంచి నీటిని కోయిల్‌సాగర్‌కు తరలించడంతో పాటు గొలుసుకట్టు చెరువులను నింపితే ఈ పరిస్థితి ఉండేది కాదు. ఇటు కోయిల్‌సాగర్ నింపక.. అటు చెరువులకు నీళ్లు మళ్లించక పోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. కేవలం వర్షాలతోనే సాగర్ నిండింది. కానీ వందలాది చెరువుల్లోకి నీళ్లు చేరక పోవడంతో కాలం మంచిగా అయిందని భావించిన రైతులు ప్రాజెక్టు కింద పెద్ద ఎత్తున పంటలు సాగు చేశారు. చివరి నిమిషంలో నీళ్లన్నీ విడుదల చేయకుండా తాత్సారం చేయడంతో పంటలు ఎండే పరిస్థితి వచ్చింది. ఎకరా ఎండినా ప్రభుత్వానిదే బాధ్యత.

కోయిల్ సాగర్‌లో తగ్గిన నీటినిల్వలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/దేవరకద్ర : పాలమూరు జిల్లాలోని మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌లో నీటి నిల్వలు తగ్గిపోయాయి రెండున్నర టీఎంసీలు నిల్వ ఉండే ఈ ప్రాజెక్టులో ప్రస్తుతం అర టీఎంసీ నీళ్లు మాత్రమే నిల్వ ఉన్నాయి. దీంతో సాగు, తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం నెలకొన్నది. ఒకవైపు సాగర్‌లో నీళ్లు ఫుల్‌గా ఉండడంతో రైతులు యాసంగిలో పంటలు పెద్ద ఎత్తున సాగు చేశారు. ప్రస్తుతం నీటిమట్టం తగ్గడంతో పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా తయారైంది. మరోవైపు ఎండా కాలంలో మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల తాగునీటి అవసరాల కోసం మిషన్ భగీరథకు ఈ నీటిని మళ్లిస్తారు. కాగా ప్రస్తుతం సాగర్ డెడ్ స్టోరేజీకి చేరడంతో ఇటు రైతుల్లో.. అటు ప్రజల్లో సందిగ్ధం నెలకొన్నది. చివరి తడికి వారం రోజుల్లో నీటిని విడుదల చేయకపోతే వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయే ప్రమాదం లేకపోలేదు. మరోవైపు ఊకచెట్టు వాగు ఎండిపోవడంతో పరీవాహక ప్రాంత రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది.

### 13.2 అడుగుల నీటిమట్టం

కోయిల్‌సాగర్‌ర ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32 అడుగులు కాగా.. మంగళవారం నాటికి 13.2 అడుగులుగా నమోదైంది. ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉన్న టువంటి రైతులకు అధికారులు ఇప్పటివరకు ఐదు విడుతలుగా నీటిని వదిలారు. ప్రస్తుతం ఆయకట్టు రైతులకు నీటిని విడుదల చేయడం సాధ్యం కాదని ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ 'నమస్తే తెలంగా'కు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. నిల్వ ఉన్న నీటిని తాగునీటి అవసరాల నిమిత్తం ఉంచినట్లు చెప్పారు. అయితే మరో సారి ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తే పలు ఎకరాల్లో పంటలు చేతికందుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. కానీ అధికారులు సాధ్యం కాదని తెగేసి చెబుతున్నారు. ఈ ఏడాది అధికంగా వర్షపాతం నమోదైనా.. కోయిల్ సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసినా సర్కారుకు ముందుచూపు లేకపోవడంతో సాగరం వెలవెల బోతున్నది. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యమే అని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆరోపించారు.

### ఆయకట్టు ప్రశ్నార్థకం

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతుల పరిస్థితి అయోమయంగా తయారైంది. రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల కింద వందలాది ఎకరాలు సాగయ్యాయి. కానీ నీటి లభ్యత తగ్గిపోవడంతో అధికారులు వారంబంది పద్ధతిలో పంటలకు నీటిని విడుదల చేశారు. దీంతో చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితులు. ఇప్పటికే నీళ్లందక పంటలు ఎండిపోయాయి మరోవైపు విద్యుత్ కోతలు రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆయకట్టు రైతుల పరిస్థితి ఇలా ఉంటే.. వాగు పరీవాహక ప్రాంతాల్లో పంటలు సాగుపై అనిశ్చితి నెలకొన్నది. నీళ్లు అందక వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నది.



నీళ్లు పారని కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ఎడమ కాల్వ

# సభను పండుగలా నిర్వహించాలి

- వరంగల్ సభకు బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- కొల్లాపూర్‌లో రజతోత్సవ సభ పోస్టర్ల ఆవిష్కరణ

కొల్లాపూర్ రూరల్, ఏప్రిల్ 14 : బీఆర్‌ఎస్ 25 ఏండ్ల పార్టీ పుట్టిన రోజు వేడుకలను పండుగలా జరుపుకోవాలని, అందులో భాగంగా వరంగల్‌లో నిర్వహించే బహిరంగసభకు పార్టీ శ్రేణులు, ప్రజలు, పెద్దఎత్తున తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రజతోత్సవ సభకు సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం ఆవిర్భవించిన ఇంటి పార్టీ బీఆర్‌ఎస్ అని, మన పార్టీ పుట్టిన రోజు అంటే మనందరికీ పండుగ రోజని అన్నారు. అందుకే వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ సభకు ఉమ్మడి జిల్లా నుంచి వేలాది మంది ప్రజలు తరలిరావడానికి సిద్ధమవుతున్నారని, కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి ప్రజలు ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

## నష్టపోయిన రైతుకు
# పరిహారమివ్వాలి

- సీఎం రేవంత్ సొంత ఇలాకాలో పంటలెండుతున్నా పట్టింపు లేదా..?
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం
- పట్నంతో కలిసి ఎండిన పంటల పరిశీలన

మద్దూరు (కొత్తపల్లి), ఏప్రిల్ 14 : భూగర్భ జలాలు అడుగంటడం తోపాటులో ఓల్టేజీ సమస్యలతో ఎండిన పంటలకు ఎకరాకు రూ.40 వేల నష్టపరిహారం చెల్లించాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కొత్తపల్లి మండలం గోర్లోనిబావిలో ఎండిన పంటలను మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకోక పోవడం దారుణం అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్యతో పాటుభూగర్భ జలాలు అడుగంటి చేతికొచ్చిన పంటలు ఎండిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం ఇప్పటికైనా స్పందించి ఎండిన పంటలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొత్తపల్లి బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల తోపాటు రైతులు పాల్గొన్నారు.



ఎండిన వరి పొలంలో రైతుతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

## అకాల వర్షం
# రైతన్న ఆగం

- మన్యంకొండ వద్ద తడిసిన 2 వేల క్వింటాళ్ల ధాన్యం
- ఆదుకోవాలన్న అన్నదాతలు
- కేంద్రం ప్రారంభించినా కొనుగోలు చేయకపోవడంతో వర్షార్పణమైందని ఆవేదన

పాలమూరు, ఏప్రిల్ 14 : మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో సోమవారం అకాల వర్షం కురియగా దాదాపు రెండు వేల క్వింటాళ్ల వరి ధాన్యం తడిసి తీవ్ర నష్టం వాటిల్లింది. మహబూబ్‌నగర్ రూరల్ మండలం మన్యం కొండ స్టేజీ వద్ద ఎప్పటిలాగానే చుట్టు పక్కల గ్రామాలైన కోడూరు, ఓబులాయపల్లి, కోటకదిర, రామచంద్రపురం గ్రామాల రైతులు ధాన్యం కోసిన వెంటనే అక్కడ ఆరబెట్టడానికి తీసుకువస్తారు. గత కొన్ని రోజులుగా రైతులు ధాన్యం ఆరబెడుతున్న నేపథ్యంలో సోమవారం అకస్మికంగా కురిసిన అకాల వర్షానికి దాదాపు 2వేల క్వింటాళ్ల ధాన్యం తడిసింది. అక్కడే ఉన్న రైతులు ధాన్యాన్ని తడవకుండా కాపాడుకునే చేసిన ప్రయత్నం ఫలించక పోగా ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయ్యింది. అయితే వారం రోజుల కిందట స్థానిక ఎమ్మెల్యే ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించినా ఇప్పటికీ ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో ఇంత ఆలస్యం చేయలేదన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. తడిసిన ధాన్యాన్ని బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మస్తాన్, రాఘవేందర్ గౌడ్ తదితరులు పరిశీలించి ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



మన్యంకొండ వద్ద తడిసిన ధాన్యం



తడిసిన ధాన్యాన్ని దగ్గరికి చేస్తున్న రైతులు




# అంబేద్కర్ అందరివాడు


- మాజీ మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు
- బీఆర్ చూపిన సన్మార్గంలో నడవాలని పిలుపు

మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని పలువురు నాయకులు కొనియాడారు. సోమవారం ఉమ్మడి పాలమూరు జిల్లాలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వనపర్తి, జడ్చర్లలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కొత్తపల్లి మండలం భూనీడ్‌లో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఉండవెల్లి మండలం పుల్లూరులో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, కల్వకుర్తి మండలం గుండూరులో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో అందరూ నడవాలని పిలుపునిచ్చారు.

మద్దూర్ (కొత్తపల్లి) ఏప్రిల్ 14 : బడుగుల ఆశాజ్యోతి అంబేద్కర్ అని మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్ అన్నారు. సోమవారం కొత్తపల్లి మండలం భూనీడ్‌లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాభ్యుదయయే జీవిత ధ్యేయంగా జీవించిన త్యాగశీలి అంబేద్కర్ అని పేర్కొన్నారు. చట్ట ప్రకారం పౌరులకు సమాన హక్కులను ప్రోత్సహించడానికి ఆయన అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. అందరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం వారు తిమ్మారెడ్డిపల్లిలో వెలిసిన గిరిజనుల ఆరాధ్య దైవమైన గురులోక మసంద్(బావాజీ)ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవమైన గురులోక మసంద్ ప్రభు బావాజీ ఆశయాలను కొనసాగించాలని, ఆయన ఆధ్యాత్మిక జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. వారి వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు సలీం, కార్యకర్తలు ఉన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నవీన్, మాజీ మంత్రి సత్యవతి, మాజీ ఎమ్మెల్యే పట్నం



జడ్చర్లలో నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



మక్తల్‌లో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం



కల్వకుర్తి మండలం గొండూరులో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



పుల్లూరులో చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే

# మహనీయుడు అంబేద్కర్

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 14 : ప్రజాస్వామ్యానికి రాజ్యాంగంతో ప్రాణం పోసిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. సోమవారం అంబేద్కర్ జయంతిని ఉండవల్లి మండలం పుల్లూరులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే విజయుడు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన కేక్ కట్ చేసి చిన్నారులకు కేక్ తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశదేశాలకు సంబంధించిన రాజ్యాంగాలను పరిశీలించిన అనంతరం ప్రపంచంలోనే అత్యున్నతమైన రాజ్యాంగాన్ని బాబా సాహెబ్ అంబేద్కర్ మనకు అందించారన్నారు. దళితులకు రిజర్వేషన్ కల్పన వంటి విప్లవాత్మక అంశాన్ని రాజ్యాంగంలో పొందుపర్చారని, ఇది కేవలం సమాజంలో ఉన్న అసమానతలను దూరం చేయడానికి అని అన్నారు. ప్రతి గుడిసెకు ప్రతి దళితుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిన నాడే అంబేద్కర్ కల సాకారమవుతుందని ఆయన వివరించారు. అంతకుముందు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంబేద్కర్ కమిటీ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెండులారీలు ఢీ : ఇద్దరు మృతి

మానవపాడు ఏప్రిల్ 14 : నిలిచి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టగా ఇద్దరు మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో చోటు చేసుకున్నది. ఎస్సై చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో మండలంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై జల్లాపురం శివారులోని ఆర్టీఏ చెక్‌పోస్ట్ దగ్గర నాందేడ్ నుంచి కేరళకు పసుపు లోడుతో వెళ్తున్న లారీని షాద్‌నగర్ నుంచి ఆళ్లగడ్డకు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆళ్లగడ్డకు వెళుతున్న లారీలోని డ్రైవర్‌కం ఓనర్ షక్‌హుస్సేన్, క్లీనర్ కదిరి వీరయ్య అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా ఈ ఘటనపై తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న లారీలు

# మిడ్జిల్‌లో వడగండ్ల వాన

జడ్చర్ల(మిడ్జిల్), ఏప్రిల్ 14 : జడ్చర్ల నియోజకవర్గంలోని మిడ్జిల్ మండలంలో సోమవారం సాయంత్రం వడగండ్లతో కురిసిన అకాల వర్షానికి వరి పైర్లు దెబ్బతిన్నాయి. మండలంలోని అయ్యవారిపల్లి, వాడ్యాల, వెలుగొములు, చిల్వేరు, కొత్తూరు తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షానికి దాదాపు 350పైగా ఎకరాల్లో వరి పైర్లు దెబ్బతిన్నట్లు తెలిసింది. అయ్యవారిపల్లిలో నర్సింహారెడ్డి అనే రైతుకు చెందిన 7ఎకరాల వరిపంట వడగండ్ల వానకు తీవ్రంగా దెబ్బతిన్నదని గ్రామస్తులు తెలిపారు. ఇతర రైతులకు చెందిన వరి పైర్లు నేల కొరగడంతో పాటు ధాన్యం గింజలు నేలరాలాయి దాంతో రైతులందరు తీవ్రంగా పంటలను నష్టపోయారు. గత నాలుగైదు నెలలుగా వర్షాలు లేక భూగర్భజలాలు అండుగంటి రైతులు వేసిన పంటలు ఎండిపోయిన సమయంలో కురిసిన అకాల వర్షాలు రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మిడ్జిల్ మండలం అయ్యవారిపల్లిలో నేలరాలిన వరి గింజలు

# ఈతకు వెళ్లి ఒకరి మృతి.. ఇద్దరి గల్లంతు

- పాలమూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల సమీపంలో ఘటన

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 14 : ఈతకు వెళ్లిన ఇద్దరు మృతి చెందగా.. మరొకరు కాపాడే యత్నంలో నీటిలో మునిగిపోగా.. మరో ఇద్దరు గల్లంతైన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో చోటు చేసుకున్నది. పోలీసుల కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లాలోని దివిటిపల్లి సమీపంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లల్లో మైమూద్(27), విజయ్(30), అయ్యప్ప (18) నివసిస్తున్నారు. మైమూద్ వెల్డింగ్ పనిచేస్తుండగా.. మిగితా ఇద్దరు ప్రైవేటు కంపెనీలో విధులు నిర్వర్తిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం ఇండ్ల సమీపంలోని క్వారీ వద్ద ఉన్న నీటిలో ఈత కొట్టేందుకు వీరు వెళ్లారు. అయితే నీటిలో మునిగిపోతుండగా.. వీరిని కాపాడేందుకు అక్కడే ఉన్న కొందరు ప్రయత్నించినా లాభం లేకపోయింది. ముగ్గురు నీటిలో మునిగిపోయారు. తర్వాత కొంద్దిసేపటికి విజయ్ మృతదేహాన్ని బయటకు తీయగా.. మరో ఇద్దరి ఆచూకీ ఇంకా లభించలేదు. విషయం తెలుసుకొన్న రూరల్ ఎస్సై విజయ్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకొన్నారు. ఇద్దరి మృతదేహాల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



విజయ్, అయ్యప్ప, మహమూద్ (ఫైల్)

### చెరువులో పడి ఇద్దరు ..

బాలానగర్, ఏప్రిల్ 14 : బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోతీగణపూర్ గ్రామ శివారులోని చెరువులో పడి ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. ఎస్సై లెనిన్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన శివ రాములు (50), యాదగిరి (32) సోమవారం గ్రామ సమీపంలోని చెరువులో ప్రమాదవశాత్తు మునిగి చనిపోయారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో శివరాములు చెరువులో ఈతకు వెళ్లాడు. ఈత కొడుతూ కొద్దిసేపటికి చెరువులో మునిగిపోతుండగా గమనించిన యాదగిరి శివరాములును కాపాడేందుకు చెరువులోకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఇద్దరూ మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎస్సై లెనిన్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. చెరువులో నీరు అధికంగా ఉండడంతో మృతదేహాలను వెలికి తీసేందుకు షాద్‌నగర్ నుంచి అగ్నిమాపక సిబ్బందిని రప్పిస్తున్నట్లు తెలిపారు.